## 1న అసెంబ్లీ అభ్యర్థులకు అవగాహన

కొల్లాపూర్, అక్టోబర్ 30 : నామినేషన్ వేసే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, ఇతరులకు నవంబర్ 1వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు కొల్లాపూర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అయితే నవంబర్ 3న తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ఘట్టం కొనసాగనున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఇతరులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## నేడే ఓటరు నమోదుకు చివరి తేదీ

కొల్లాపూర్, అక్టోబర్ 30 : ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోనుటకు ఈనెల 31న చివరి తేదీ అని ఏఈఆర్వో శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అందరూ కూడా ఓటరు జాబితాను చూసుకోగలరని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే 23 ఏండ్లు దాటిన వారు కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేస్తున్నారు. కానీ గతంలో వారికి ఎక్కడో ఒక్క చోట ఓటు ఉండి ఉంటుంది. వారి ఓటును ఫాం8 ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఎక్కడ కూడా ఓటు లేని వారు, అలాగే 25 ఏండ్లు నిండిన వారు ఫాం 3 డిక్లరేషన్ పూర్తి చేసి ఇవ్వాలని ఏఈఆర్వో శ్రీకాంత్ పేర్కొన్నారు. ఓటు లేదని డిక్లరేషన్ ఇవ్వడం, వేరే చోట ఓటు ఉండి తిరిగి ఇక్కడ ఫాం 6 ద్వారా కొత్త ఓటు కోసం నమోదు చేసినట్లయితే వారిపై ఈసీఐ సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్, అక్టోబర్ 30 : మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో ఇంచార్జి డీఎం బాలసరస్వతి సోమవారం ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ డిపో పరిధికి సంబంధించి సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా 9000405878కు తెలపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ దవఖానలోనే మెరుగైన వైద్యం

పాన్‌గల్,అక్టోబర్ 30 : ప్రభుత్వ దవఖానలో మెరుగైన వైద్యం అందుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి అన్నారు. సోమవారం మండలకేంద్రానికి చెందిన కవిత గర్భిణీ మహిళ పీహెచ్‌సీలో సుఖప్రసవం జరుగగా ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని డాక్టర్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ దవఖానాలో అన్ని రోగాలకు మెరుగైన వైద్యం అందించడం తోపాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం బాలింతకు కేసీఆర్ కిట్టు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

పాన్‌గల్,అక్టోబర్ 30 : మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన పుట్టపాగ రాముడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దళిత బహుజన సమాఖ్య సంఘం సభ్యులు సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శివశంకర్, ఆంజనేయులు, శ్రీకాంత్, నాగేశ్, సాయికుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 7వ తేదీ వరకు నవోదయ దరఖాస్తులు

బిజినపల్లి, అక్టోబర్ 30 : మండలంలోని వట్టెం గ్రామంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 9, 11వ తరగతులలో ఖాళీగా వున్న సీట్లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 31తో ముగియనుండగా నవంబర్ 7వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని, విద్యార్థుల అభ్యర్థన మేరకు గడువు పెంచారని ఆయన పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షకు హాజరు కాబోయే అభ్యర్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ 01.05.2009 నుంచి 31.07.2011 తేదీల మధ్య జన్మించి ఉండాలని, అదేవిధంగా పదకొండవ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చదువుతూ 01.06.2007 నుంచి 31.07.2009 తేదీల మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏదేని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఉచితంగా www.navodaya.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో 07.10.2023లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే వారి తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి జిల్లాలోనిదై వుండాలని, రెండు తరగతుల ప్రవేశ పరీక్ష 10.02.2024న నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# నేడు బీఆర్ఎస్ సమ్మేళనం

- ఏర్పాట్లు పరిశీలించిన నాయకులు
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత



వీపనగండ్లలో ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పాన్‌గల్‌లో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు మాత్రూనాయక్

పాన్‌గల్, అక్టోబర్ 30 : మండలంలోని కదిరేపాడు గ్రామం గన్యానాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు మాత్రూనాయక్ సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మండల ఇంచార్జి అభిలాశ్‌రావు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాము యాదవ్‌ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాత్రూనాయక్‌కు గులాబీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆకర్షితులై మండలంలోని వివిధ గ్రామాలనుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు ఆయా పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వారెంటీ లేని కాంగ్రెస్‌పోళ్ల గ్యారెంటీలను నమ్మితే ప్రజలు అరిగోస పడేఅవకాశం ఉందన్నారు. అధికారంలోకి రాగానే పేదలకు కేసీఆర్ బీమా, రైతుబంధు పెంపు, రూ.400లకే సిలిండర్ తదితర పథకాలు పేదలకు భరోసా కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, నరసింహ, సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 1న మండల స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం..

వీపనగండ్ల, అక్టోబర్ 30 : మండల కేంద్రంలో నిర్వహించనున్న రేపు మండల స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యానారాయణగౌడ్, ఎంపీపీ కమలేశ్వరావు, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం గ్రౌండ్ పక్కన నున్న ఒంటిమామిడి చెట్టు క్రీడామైదానంలో రేపు నిర్వహించనున్న ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ రెడ్డి, ఎంపీ రాము లు హాజరవుతారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా స్థల, ఏర్పాట్లు తదితర అంశాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, కురుమయ్య, సాయిరామ్, రామస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.లక్ష పట్టివేత

పాన్‌గల్,అక్టోబర్ 30 : ఎన్నికల నేప థ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా వీపనగండ్ల మండలం పుల్లరచర్ల గ్రామానికి చెందిన చిన్నస్వాములు బైక్‌పై వెళ్తుండగా తనిఖీలో భాగంగా బైక్‌ను ఆపి తనిఖీ చేయగా రూ.1లక్ష పట్టుబడ్డాయని తెలిపారు.ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బు ను స్వాధీనం చేసు కొని చిన్నస్వాములుపై కేసు నమో దు చేసినట్లు ఎస్సై వేణు తెలిపారు. తనిఖీలో పోలీ స్ సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలి

- బందోబస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలి
- కేంద్ర ఎన్నికల కమిషనర్ నితీశ్‌వ్యాస్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 30 : నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం ఢిల్లీ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారని, అదేరోజు నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుంది కాబట్టి అందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 100 మీటర్ల హద్దులు ఏర్పాటు చేసుకోవడం, అవసరమైన పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సువిధాయాప్ ద్వారా నామినేషన్ వేసే అభ్యర్థులకు తగిన సాంకేతిక పరిజ్ఞానం, సహకారం అందించే విధంగా చూసుకోవాలన్నారు. సరైన సమయా న్ని సూచించే ఒక గోడ గడియారం పెట్టుకోవాలని తెలిపారు. అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు ఏమైనా ఉంటే వాటిని కేవైసీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, తద్వారా ప్రజలందరూ తెలుసుకునే విధంగా యాప్‌ను రూపొందించారన్నారు. అభ్యర్థులకు ఎన్నికల ప్రచార వ్యయం, నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తెరిపించాలని సూచించారు. నూతన ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోడానికి అక్టోబర్ 31 చివరి తేదీన వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ ఓటరు జాబితాలో పేరు చేర్చడమే కాకుండా ఎపిక్ కార్డులు ముద్రించి పంపించాలని తెలియజేశారు. నవంబర్ 10 తర్వాత ఓటరు స్లిప్పులు ఓటర్లకు అందించే విధంగా కార్యాచరణ చేసుకోవాలి. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత పోస్టల్‌బ్యాలెట్‌లు, బ్రెయిలీ లిపి బ్యాలెట్‌లు అవసరమైన మేరకు ముద్రించి ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్‌లు సౌకర్యాలు కేంద్రాల్లో ఓటు తీసుకొని వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధిత అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సీజర్ కమిటీకి సంబంధించి ప్రజల నుంచి ఎక్కువ ఫిర్యాదులు రాకుండా పారదర్శకతతో పట్టుకున్న నిధులు ఆభరణాలు సీజ్ చేయాలని తెలిపారు. ఎన్నికల్లో ప్రలోభాలు పెట్టేందుకు తరలించే నిధులు ఎక్కడ దొరికినా పకడ్బందీగా సీజ్ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే 24 గంటల్లో పరిష్కరిస్తారన్నారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉత్పన్నమైన నిమిషాల వ్యవధిలో చేరుకొని పరిష్కరించే విధంగా సమీకృత కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వీసీలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, నాగర్‌కర్నూల్, అచ్చంపేట రిటర్నింగ్ అధికారులు వెంకట్‌రెడ్డి, గోపిరామ్, జిల్లా నోడల్ అధికారులు నర్సింగ్‌రావు, పత్యానాయక్, ఉష, ఫయాజుద్దీన్, రమాదేవి, శ్రీనివాస్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ నితీశ్‌వ్యాస్

## ముమ్మరంగా వాహనాలు తనిఖీ



ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేస్తున్న ఎస్సై రాజు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 30 : మండలంలోని ముష్టిపల్లి, పెద్దకార్పాముల, పెద్దకొత్తపల్లి, సాతాపూర్, కల్వకోల్ తదితర గ్రామాల్లో ఎన్నికల బందోబస్తులో భాగంగా వాహనాలను పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమతులు లేకుండా వాహనాల్లో ఆర్టీసీ బస్సుల్లో డబ్బులు ఇతర వస్తువులను తీసుకెళ్తే వారిని తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేస్తామని ఎస్సై రాజు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, మద్యం విక్రయిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తీసుకెళ్తున్న డబ్బును జిల్లా ఎన్నికల అధికారికి అప్పజెప్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కురుమయ్య, కల్యాణ్, సంపత్ తదితరులు ఉన్నారు.